నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 17 ఏప్రిల్ 2025 | SIDDIPET

గులాబీ దండులో రజతోత్సవం

ఎల్కతుర్తి సభకు ముమ్మర ఏర్పాట్లు

- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రెండు లక్షలకు పైగా తరలివెళ్లనున్న శ్రేణులు
- ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న హరీశ్‌రావు
- నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు
- సిద్దిపేట,మెదక్,సంగారెడ్డి జిల్లాల్లో పెద్దఎత్తున వాల్ రైటింగ్
- మండలాలకు చేరుకుంటున్న సభ ప్రచార సామగ్రి
- బస్సులు, డీసీఎంలు, ఇతర వాహనాల బుకింగ్
- సిద్దిపేట నుంచి పాదయాత్రగా వెళ్లనున్న యువత, విద్యార్థులు
- తొవ్వ ఖర్చులకు కొన్ని ప్రాంతాల్లో కూలి పనులు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు
- వివిధ రూపాల్లో సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న గులాబీ దండు

సిద్దిపేట, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మెతుకు సీమ సిద్ధమవుతున్నది. ఉద్యమాలకు పురిటి గడ్డ ఉమ్మడి మెదక్ జిల్లా ఆది నుంచి గులాబీ పార్టీకి అండగా నిలిచింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈప్రాంత బిడ్డ కావడంతో మొదటి నుంచి జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అంటే తమ ఇంటి పార్టీగా భావిస్తున్నారు. ఈనెల 27న నిర్వహించే బహిరంగ సభకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లి కేసీఆర్‌పై తమకున్న అభిమానాన్ని చాటేందుకు ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణ, ఇతర అంశాలపై పార్టీ అధినేత కేసీఆర్ ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ బాధ్యులతో ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ ఆదేశాలతో ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి రెండు లక్షల మంది పార్టీ శ్రేణులు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

ఉమ్మడి జిల్లా నుంచి రెండు లక్షల మంది..

సిద్దిపేట నియోజకవర్గం నుంచి 20 వేల మందికి పైగా సభకు వెళ్లేందుకు ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు, యువత, రైతులు అందరూ సభకు వెళ్లనున్నారు. గజ్వేల్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని పార్టీ నేతలకు సూచనలు చేశారు. గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, నాయకులు మాదాసు శ్రీనివాస్ ఇతర నాయకులు సభ విజయవంతంపై దృష్టిసారించారు. గజ్వేల్ నుంచి 20 వేల మందికి పైగా వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. దుబ్బాక నియోజకవర్గం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు , ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో సుమారు 20 వేల మంది శ్రేణులు వెళ్లేందకు సిద్ధమవుతున్నారు. సభకు అతి దగ్గరగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎక్కువ మొత్తంలో వెళ్లనున్నారు. జనగామ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మానకొండూరు నుంచి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మెదక్ నుంచి పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి, ఇతర నేతల నేతృత్వంలో సుమారుగా 10 వేల మంది, నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నేతృత్వంలో సభకు వేలాదిగా వెళ్లేందుకు చురుగ్గా ముమ్మర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోల్ నుంచి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, పటాన్‌చెరువు నుంచి పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి నేతృత్వంలో భారీగా వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు, నారాయణ్‌ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించారు. రజతోత్సవ సభ జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాలకు దూరంగా ఉండడంతో ఇక్కడి నుంచి 4 నుండి 5 వేల మంది ముఖ్యనేతలు, పార్టీ నాయకులు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తొవ్వ ఖర్చులకు కూలి పని చేస్తున్న గులాబీ సైన్యం

స్వచ్ఛందంగా రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సమాయత్తం అవుతున్నారు. కొన్నిచోట్ల తొవ్వ ఖర్చుల నిమిత్తం కూలీ పని చేసి వచ్చిన డబ్బులను వాహనాల ఖర్చులకు ,ఇతర వాటికి సమకూర్చుకుంటున్నారు. ఇప్పటికే బెజ్జంకి మండలం లక్ష్మిపూర్‌లో మహిళా నేతలు కూలీ పనిచేసి తొవ్వ ఖర్చులు సిద్ధం చేసుకున్నారు. నంగునూరు మండలం ఘణపూర్ పార్టీ క్యాడర్ తమ తొవ్వ ఖర్చుల కోసం కూలీ పని చేసి డబ్బులు సమకూర్చుకున్నారు. సిద్దిపేట పట్టణంలో బీఆర్ఎస్వీ నేతలు కూలి పనిచేశారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. గ్రామ గ్రామమా వాల్ రైటింగ్ రాయిస్తున్నారు. గోడలపై సభ ప్రచార పోస్టర్లను అతికిస్తున్నారు. చలో వరంగల్ అంటూ పెద్ద ఎత్తున వాల్ రైటింగ్‌ను స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ ముఖ్యనాయకుల పేర్ల మీద రాయించారు. ఎటు చూసినా వరంగల్ సభ వాల్ రైటింగ్‌లు జిల్లాలో పెద్దఎత్తున కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మండలం, గ్రామాల వారీగా పార్టీ నాయకలు సమావేశాలు నిర్వహించుకొని సభకు వెళ్లేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.అవసరమైన బస్సులు, డీసీఎంలు, ఇతర వాహనాలను బుకింగ్ చేశారు. ఆయా నియోజకవర్గాలకు అవసరం మేరకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులను బుక్ చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి భారీగా తరలివెళ్లి ఉద్యమాల గడ్డ అని మరోసారి సత్తా చాటాలని గులాబీ దండు ఎదురు చూస్తున్నది.

రజతోత్సవ సభకు పెద్దఎత్తున ప్రచారం

25న సిద్దిపేట నుంచి యువత పాదయాత్ర

ఈనెల 25న ఉదయం సిద్దిపేట అమరవీరుల స్తూపం నుంచి సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 1500 మంది యువత, విద్యార్థులు పాదయాత్రగా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు బయలుదేరి వెళ్లనున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వారికి దిశానిర్దేశం చేశారు. సిద్దిపేట నుంచి బయలుదేరిన యువత పాదయాత్ర 27న సాయంత్రం రజతోత్సవ సభకు చేరుకుంటుంది. ఈ పాదయాత్ర ప్రత్యేకంగా ఉండనున్నది. ప్రత్యేకమైన టీషర్టులు, టోపీలు, గులాబీ జెండాలతో గులాబీ సైన్యం సిద్దిపేట నుంచి హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు చేరుకుంటుంది. ప్రతి గ్రామం నుంచి 10 నుండి 15 మంది యువత బయలుదేరుతుంది. ఇప్పటికే పాదయాత్రగా వెళ్లే యువత తమ పేర్ల జాబితాను పార్టీ బాధ్యులకు అందించారు. వీరి వెంట కళాజాత ఉండనున్నది.

బీఆర్ఎస్‌లో చేరికలు


ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బాలయ్య

- గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లా

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 16: ధూళిమిట్ట మండలంలోని తోర్నాలలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు తుషాలపురం బాలయ్య కాంగ్రెస్‌కు రాజీనామా చేసి పదిమంది కార్యకర్తలతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన తుషాలపురం బాలయ్యకు ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన తుషాలపురం బాలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ విధానాలతో పాటు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అవలంబిస్తున్న వైఖరి నచ్చక కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్యక్రమంలో ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి, మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతి రెడ్డి, మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ, మాజీ ఎంపీటీసీ ఆకుల యాదగిరి, నాయకులు తాళ్లపల్లి భిక్షపతి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గోనెపల్లి మల్లేశం పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష

తోర్నాలలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 16: తెలంగాణకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ధూళిమిట్ట మండలంలోని తోర్నాలలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి, బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా బీఆర్ఎస్ ఆవిర్భవించినట్లు తెలిపారు. 25 ఏండ్లలో బీఆర్ఎస్ ఎన్నో విజయాలు చూసిందన్నారు. సాధించుకున్న తెలంగాణను దేశంలోనే అగ్రభాగాన నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ కోసం అనునిత్యం తపించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, అందుకోసమే బీఆర్ఎస్‌ను ప్రజలు తమ ఇంటి పార్టీగా అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. 2001 నుంచి బీఆర్ఎస్‌లో పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మీసాగర్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఆకుల యాదగిరి, గ్రామ మాజీ సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ, సీనియర్ నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, తాళ్లపల్లి భిక్షపతి, నాచగోని వెంకట్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు గోనెపల్లి మల్లేశం, యూత్ మండల అధ్యక్షుడు బడుగు సాయిలు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోర్నాలలో బీఆర్ఎస్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సభను విజయవంతం చేయాలి

జగ్గంపేటలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- చలో వరంగల్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

చిలిపిచెడ్, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని జగ్గంపేటలో చలో వరంగల్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వరాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్‌కు ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేక పోయిందన్నారు. ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా బండ్ పెట్టి రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ ధర్మారెడ్డి, రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, యాదగిరి, దుర్గారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, షఫీయొద్దీన్, వీరాస్వామి, విఠల్, కున్యానాయక్, మధు, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సార్ రావాలి.. రైతులు బాగుపడాలి

బీఆర్ఎస్ నాయకులకు విరాళం అందజేస్తున్న రైతు నాగార్జున

చేర్యాల, ఏప్రిల్ 16: కేసీఆర్ సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రైతులు సల్లగ బతికిండ్రు... ఇప్పుడు పంటలు ఎండిపోయి చుక్క నీరు రావడం లేదు. మళ్లీ కేసీఆర్ సార్ రావాలే... రైతులు బాగుపడాలి అని రైతు నాగార్జున అభిప్రాయం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతం కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి ముఖ్య నాయకులను కలిసి సన్నాహాక సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని నాగపురి గ్రామానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులకు రైతు నాగార్జున ఎదురుగా వచ్చి వరి పొలం వద్దకు వారిని తీసుకుపోయి ఎండిపోయిన విషయాన్ని తెలియజేశారు. అనంతరం రజోత్సవ సభకు తనవంతుగా రూ.1000 విరాళంగా అందజేసి కేసీఆర్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు మీస పార్వతి, బీఆర్ఎస్ నాయకులు బండమీది కరుణాకర్, నర్సింహులు, సత్యనారాయణ, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గులాబీదండు కదంతొక్కాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డిలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ అతికిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

కంది, ఏప్రిల్ 16: కేసీఆర్ తలపెట్టిన భారీ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ మొదలైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో తలపెట్టిన రజతోత్సవ సభకు గులాబీదండు కదంతొక్కాలని, జిల్లా నుంచి వేల సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం సంగారెడ్డిలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన అతికించి జై తెలంగాణ నినాదాలు చేశారు. సంగారెడ్డి మొత్తం గులాబీమయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు సాయినాథ్, నర్సింహులు, చక్రపాణి, విఠల్, గోవర్ధన్, మల్లేశం, మల్లాగౌడ్, శ్రవణ్‌రెడ్డి, ప్రేమానందం, షఫీ పాల్గొన్నారు.

ఎన్నికలొస్తే కేసీఆర్ ప్రభుత్వం ఖాయం

- చలో వరంగల్ సభను విజయవంతం చేయాలి
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టేక్మాల్, ఏప్రిల్ 16: ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని, ఈనెల 27న చలో వరంగల్ సభను విజయవంతం చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. టేక్మాల్‌లో బుధవారం రజతోత్సవ వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ ఆవిర్భవించిందని, ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను అధిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ నాయకత్వంలో సాధించుకున్నామన్నారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు గడుస్తున్న తరుణంలో రజతోత్సవాలను నిర్వహించేందుకు సంకల్పించిందన్నారు. సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు తరలిరావడానికి సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. అధికారంలో ఉన్న పదేండ్లలో ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని గుర్తుచేశారు. స్వరాష్ట్ర ఉద్యమ ఆకాంక్షతో ఆవిర్భవించిన బీఆర్ఎస్ ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను తీసుకువచ్చి తెలంగాణ ప్రజలను అన్ని రంగాల్లో అగ్రగామిగా ముందుకు నడిపించిందని తెలియజేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేసి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు సిద్దయ్య, రవి, రజాక్, సాయిబాబా, మల్లేశం, సలావోద్దీన్, సాయిలు, సంగయ్య, బాలకృష్ణ, నారాగౌడ్ ఉన్నారు.

పేదల ఉపాధికి ప్రోత్సాహం అందివ్వాలి

- డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా

చిన్నకోడూరు, ఏప్రిల్ 16: చేతివృత్తుల వారిని ప్రోత్సహించడంతోపాటు పేదలకు జీవనోపాధి కల్పించి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడమే వాటర్ షెడ్ పథకం లక్ష్యమని డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా అన్నారు. బుధవారం మండల పరిధిలోని చౌడారంలో వాటర్ షెడ్ యాత్ర నిర్వహించారు. జీవనోపాధుల కింద నెలకొల్పిన పలు యూనిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పండ్ల తోటల పెంపకానికి సబ్సిడీ ఇస్తున్నామన్నారు. నేల, నీరు, వృక్ష సంపదను వినియోగించుకోవాలన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా కందకాలు, రాతికట్టడాలు, చెక్ డ్యామ్‌లు నిర్మించుకోవచ్చన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నాలుగు రెవెన్యూ గ్రామాల్లో 311 మందికి రూ.1.54 కోట్ల రుణాలు వీవోల ద్వారా మహిళా జీవనోపాధికి అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, అడిషనల్ పీడీ బాలకిషన్, డీపీఎం కరుణాకర్, ఏడీవీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో జనార్దన్, వాటర్ షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ నూరోద్దీన్, ఎంపీవో సోమిరెడ్డి, ఏపీవో స్రవంతి, ఏపీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

చౌడారంలో వాటర్‌షెడ్ యాత్రను ప్రారంభిస్తున్న డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా

ఉపాధికర్తలుగా ఎదగాలి

- గీతంలో కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పట్టభద్రుల దినోత్సవం

గీతంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 16: ఉద్యోగాల కోసం కాకుండా ఉపాధి కర్తలుగా ఎదగాలని గీతం డీమ్డ్ యూనివర్సిటీ, కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కే ఎస్ పీపీ) తృతీయ పట్టభద్రుల దినోత్సవంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి పట్టభద్రుల వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన కౌటిల్యా విద్యార్థులంతా ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలన్నారు. జాతీయంగా, ప్రపంచ వ్యాప్తంగా ప్రజా విధాన రూపకల్పనలో వారు పోషించే కీలక పాత్రను ఆయన వివరించారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్ మాట్లాడుతూ పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా 30మందికి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలు ప్రదానం చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. డిగ్రీ ప్రదానోత్సవాన్ని కేఎస్ పీపీ డీన్, ఐక్యరాజ్యసమితిలో భారత పూర్వ శాశ్వత ప్రతినిధి ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ నిర్వహించారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖరన్, గీతం ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.